సాక్షి కరీంనగర్

శుక్రవారం । 15 । మార్చి । 2024



అభిషేక ప్రియుడికి వందనం

వేములవాడ: రాజన్నను గురువారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి 110 అభిషేకాలు పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:24	శని 4:55

గరిష్టం/కనిష్టం 35.0/24.0

వాతావరణం

జిల్లాలో నేడు సాధారణ వాతావరణం ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతుంది.



వార్షికోత్సాహం

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మానీరు తగ్గుతోంది

మార్చిలోనే మా'నీరు' తగ్గుతోంది. వేసవి ప్రారంభ దశలోనే ఎల్ఎండీ నీళ్లు అడుగంటుతున్నాయి. కరీంనగర్ సిటీవాసులకు తాగునీటి కటకట ప్రారంభమవుతోంది. ఎండలు మండుతుండడంతో రానున్న రోజుల్లో డ్యాంలో నీరు మరింత తగ్గే అవకాశముంది. లోయర్ మానేర్ డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. అయితే ప్రతీరోజు 66 ఎంఎల్డీ నీటిని కుళాయిల ద్వారా నగర ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇలా ప్రతీ రోజు అవసరాన్ని బట్టిచూస్తే డ్యాంలో ఉన్న నీళ్లు మరో రెండు నెలలే సరిపోనున్నాయి. ఆ తర్వాత నీటికి తండ్లాట తప్పదనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

నిషేధిత డ్రగ్ కలకలం!

- 2018లో 'ఎటోలార్-పి' ట్యాబ్లెట్‌పై బ్యాన్
- కరీంనగర్ సీతారాంపూర్ గోదాంపై అధికారులు దాడులు
- భారీగా మెడిసిన్ గుర్తింపు
- పంజాబ్‌లోని ఎడ్విన్ మెడిల్యాబ్స్‌లో ఉత్పత్తి అయినట్లు నిర్ధారణ
- బ్యాన్ చేసిన మందుల విక్రయాలపై ఫిర్యాదు చేయాలన్న డీసీఏ



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

నిషేధిత మందుల దందా కరీంనగర్‌లో జోరుగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు దొడ్డిదారిన తీసుకువచ్చి ఉమ్మడి జిల్లాలోని మెడికల్ షాపుల్లో నిలువచేస్తున్నారు. అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. ఈ మందుల వాడకంతో అప్పటికప్పుడు ఏమీ కాకపోయినా.. తర్వాత మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విషయం తెలుసుకున్న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు క్రయవిక్రయాలపై దృష్టిసారించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సాగుతున్న మందుల దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలకు ఉపక్రమించారు. నిబంధలను విరుద్ధంగా నడుస్తున్న మెడికల్ ఏజెన్సీలు, దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. నిషేధిత మందులు విక్రయించినా.. నిబంధనలు ఉల్లంఘించినా టోల్ ఫ్రీ నంబర్ 1800–599–6969కు కాల్ చేయాలని సూచిస్తున్నారు.

మెడికల్ గోదాంపై దాడులు..

ఎటోలార్-పి ట్యాబ్లెట్స్.. వీటినే ఎటోడోలక్ అండ్ పారాసిటమాల్ మాత్రలు అని పిలుస్తారు. ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్న ఫిర్యాదులతో కేంద్ర ప్రభుత్వం ఈ ఔషధంపై 2018, సెప్టెంబర్ 7న నిషేధం విధించింది. అప్పటి నుంచి ఈ మెడిసిన్ పెద్దగా వినియోగంలో లేదు. అయితే, నిషేధించి, ఆరేళ్లు అవుతున్నా కొన్ని కంపెనీలు దీన్ని అదే ఫార్ములాతో ఉత్పత్తి చేయడం, ఏజెన్సీలు సరఫరా చేయడం, కొన్ని షాపులు విక్రయించడం కొనసాగుతోంది. అవగాహన లేక కొందరు, అధిక లాభాల ఆశతో మరికొందరు ఇలా చేస్తున్నారు. ఈ క్రమంలో ఎటోలార్-పి మాత్రల విక్రయాలపై డీసీఏకు వరుస ఫిర్యాదులు వెళ్లాయి. అప్రమత్తమైన అధికారులు ఈ టాబ్లెట్లు విక్రయిస్తున్న షాపులపై నిఘా ఉంచారు. వారికి ఎవరు సరఫరా చేస్తున్నారో రహస్యంగా గుర్తించారు. బుధవారం కరీంనగర్ సీతారాంపూర్‌లోని ఓ మెడికల్ గోదాంపై దాడులు చేసి, భారీగా మెడిసిన్ గుర్తించారు. ఇవి పంజాబ్‌లోని ఎడ్విన్ మెడిల్యాబ్స్‌లో ఉత్పత్తి అవగా, హరియాణాకు చెందిన సురెవిన్ కంపెనీ మార్కెటింగ్ చేసినట్లు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి వెల్లడించారు.

భాగస్వాములెవరో తేల్చే పనిలో అధికారులు

ఎటోలార్-పి వినియోగం ఉమ్మడి జిల్లాలో భారీ స్థాయిలో ఉందని సమాచారం. ఇక్కడికి పలు ఏజెన్సీల ద్వారా ఈ మాత్రలు సరఫరా అయినట్లు అధికారులు గుర్తించారు. ఏయే ఏజెన్సీలు, షాపులు ఈ దందాలో భాగస్వాములుగా ఉన్నాయో తేల్చే పనిలో పడ్డారు. ఎటోలార్-పితోపాటు నిషేధిత మాత్రలను కొన్ని ఏజెన్సీలు మెడికల్ షాపులకు అంటగడుతున్నారన్న సమాచారం డీసీఏ వద్ద ఉంది. త్వరలో మరిన్ని ఏజెన్సీలపై దాడులు చేసి, బ్యాన్ అయిన మెడిసిన్‌ను స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని, ప్రమాణాలు పాటించకుండా కొనసాగుతున్న షాపులపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ఫిర్యాదు చేయండి



నిషేధిత మెడిసిన్ ఉత్పత్తి, విక్రయాలపై ఎలాంటి సమాచారం, అనుమానం ఉన్నా వెంటనే ఫిర్యాదు చేయాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం. అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

– వీబీ కమలాసన్ రెడ్డి, డైరెక్టర్ జనరల్, డీసీఏ

నీళ్ల కోసం పోరాటం చేస్తా

- ప్రజాహిత యాత్రలో బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

బోయినపల్లి/గంగాధర: రైతులు పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని, మరో రెండు రోజుల్లో ప్రజాహితయాత్ర ముగిసిన తర్వాత నీళ్ల కోసం కొట్లాడుతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం బూర్గుపల్లి, కోరెం, బోయినపల్లి, తడగొండ, విలాసాగర్, వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో గురువారం ప్రజాహితయాత్ర చేపట్టారు. కోరెంలో ఎల్లమ్మ, విలాసాగర్‌లో బీరప్ప ఆలయాలను దర్శించుకున్నారు. బూర్గుపల్లిలో మున్నూరుకాపు, విలాసాగర్‌లో గౌడసంఘం కమ్యూనిటీ హాల్‌కు, నర్సింగాపూర్‌లో పలు పనులకు భూమిపూజ చేశారు. బోయినపల్లిలో ముదిరాజ్ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ యాసంగిలో రైతులు వేసిన పంటలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. వరదకాల్వకు నీళ్లు ఇవ్వడం లేదన్నారు. త్వరలో నీళ్ల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో ఉపాధిహామీ పనులకు రూ.167,42కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ.72.91కోట్లు, చెట్ల పెంపకానికి రూ.88.52కోట్లు వెచ్చించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్, పెరుక శ్రావణ్, బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి ఉన్నారు.

నీరు విడుదల చేయకుంటే ఆందోళన చేస్తాం

రెండు రోజుల్లో వరదకాల్వ కు నీటిని విడుదల చేయకుంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని వెంకంపల్లి, ఉప్పరమల్యాల, గర్శకుర్తి గ్రామాల్లో గురువారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. గర్శకుర్తిలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, రూ.5లక్షలతో నిర్మించే చేనేత భవనం పనులు, రూ.2లక్షలతో నిర్మించే వేంకటేశ్వర ఆలయం మండప నిర్మాణం పనులకు బండి సంజయ్ భూమి పూజ చేశారు.



ముగిసిన పరీక్షలు.. విద్యార్థుల కేరింతలు

ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలు పరీక్ష కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. విద్యార్థులు కేరింతలు కొడుతూ జోష్‌గా కనిపించారు. విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఆయా కళాశాలలు, హాస్టళ్ల వద్దకు తల్లిదండ్రులు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఆటోలు, బస్సుల్లో రద్దీ కనిపించింది. పరీక్షలు ముగిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు ఒకరికొకరు అడ్రస్‌లు, ఆటోగ్రాఫ్‌లు ఇచ్చుకోవడం, విడిపోతున్నామనే బాధతో పాటు ఆనందంతో కళ్లు చెమ్మగిల్లాయి. జిల్లా వ్యాప్తంగా 15,233 మంది విద్యార్థులకు 383 మంది గైర్హాజరు కాగా 14,850 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డీఐఈవో తెలిపారు.

– కరీంనగర్

విద్య, వైద్యమే ప్రధాన లక్ష్యం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సైదాపూర్ మండలంలో పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సైదాపూర్(హుస్నాబాద్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ ఏర్పాటు చేశారని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లో కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అమ్మనగుర్తిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. మండలంలోని 18పాఠశాలల్లో రూ.75లక్షలతో మరుగుదొడ్లు, వంట గదులు, ఓపెన్ జిమ్‌ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. తన నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్నా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. సబ్‌స్టేషన్‌కు భూమిని విరాళంగా ఇచ్చిన దాతను మంత్రి ప్రభాకర్ సన్మానించారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో పారిశుధ్యం మరింత మెరుగు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు



స్వచ్ఛ ఆటోలను ప్రారంభిస్తున్న సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు యంత్రాలు దోహదం చేస్తాయని మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగరపాలకసంస్థ నూతనంగా కొనుగోలు చేసిన ఆరు స్వచ్ఛ ఆటోలను గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్కో వాహనానికి రూ.8.50 లక్షల వ్యయంతో ఆరు స్వచ్ఛఆటోలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. నగరంలో 310 వాహనాలతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్త తరలించేందుకు 37 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని, రోడ్లపై చెత్త వేయకుండా ఉండేందుకు 13 స్టోరేజీ డంపర్ బిన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించేందుకు 53 స్వచ్ఛ ఆటోలు ఉపయోగిస్తున్నామని తెలిపారు. నూతనంగా 18 స్వచ్ఛ ఆటోలు కొనుగోలు చేయగా, ఆరింటిని ప్రారంభించామన్నారు. కార్పొరేటర్లు గందె మాధవి, గంట కల్యాణి, చాడగొండ బుచ్చిరెడ్డి, బండారి వేణు, నేతికుంట యాదయ్య, కుర్ర తిరుపతి, సరిళ్ల ప్రసాద్, దిండిగాల మహేష్, వాల రమణారావు,తోట రాములు, ఐలెందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విలీన డివిజన్‌ల అభివృద్ధికి ప్రాధాన్యం

నగరపాలకసంస్థలో విలీనమైన డివిజన్‌ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. గురువారం నగరంలోని 18, 19 డివిజన్‌లలోని రేకుర్తిలో రూ.28 లక్షలతో చేపట్టనున్న అభివద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రేకుర్తితో పాటు మరో ఏడుగ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కావడంతో అభివృద్ధి బాట పట్టాయన్నారు. విలీన డివిజన్‌లలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. రేకుర్తి 18,19 డివిజన్‌ల అభివృద్ధికి రూ.4 కోట్ల చొప్పున మొత్తం రూ.8 కోట్లు ఇటీవలే కేటాయించామన్నారు. కార్పొరేటర్‌లు సుదగోని మాధవి, ఎదుల్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

'కదనభేరి'తో సంజయ్ గుండెల్లో దడ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

కరీంనగర్: కరీంనగర్ కదనభేరి సభ సక్సెస్‌తో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో వణుకు మొదలైందని, ఎంపీ బండి సంజయ్ గుండెల్లో దడ పుడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లుగా నయాపైసా అభివృద్ధి చేయకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ప్రజాహిత యాత్ర పేరిట అబద్ధపు ప్రచారం చేయడం ఆయనకే చెల్లిందని వారు దుయ్యబట్టారు. సంజయ్ యాత్రకు ప్రజాస్పందన కరువైందని, బయట నుంచి వచ్చిన వారితో యాత్ర నిర్వహిస్తూ.. ఊహా లోకాల్లో తేలియాడుతున్న బండికి ఓటమి తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా గెలవలేని బండి ఎంపీగా ఎలా గెలుస్తాడో ఆలోచించుకోవాలన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా బండికి ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. కేసీఆర్, వినోద్‌కుమార్, గంగుల కమలాకర్‌ల కృషితోనే కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ఎంపికైందని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా కరీంనగర్‌కు తెచ్చిన అభివృద్ధి నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మానుకుని క్షమాపణ యాత్ర నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, నయీం పాల్గొన్నారు.

'బండి' బహిరంగ చర్చకు సిద్ధంకండి

- మాజీ మేయర్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్: ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని, బహిరంగ చర్చకు సిద్ధం కావాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో మాట్లాడుతూ.. కదనభేరి సభ సక్సెస్ కావడంతో ఓటమి ఖాయమని గ్రహించిన బండి సంజయ్ యాత్ర పేరిట తిరుగుతూ కేసీఆర్, కేటీఆర్, వినోద్‌లపై అడ్డగోలు విమర్శలు చేయడం సరికాదన్నారు. కరీంనగర్ ఎంపీగా తెచ్చిన ప్రత్యేక నిధులు ఏమిటో, ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఆలయాల నిధులు, నవోదయ విద్యాలయాలు, మెడికల్ కళాశాలలు, జాతీయ రహదారులు, నూతన రైల్వే మార్గాలు సాధించినవి ఏమిటో చెప్పేందుకు బండి సంజయ్ చర్చకు వస్తే బాగుంటుందని అన్నారు. వినోద్‌కుమార్ చొరవతోనే స్మార్ట్‌సిటీ సాధ్యమైందని, కరీంనగర్‌కు అర్హత లేకున్న నాడు కేంద్రాన్ని ఒప్పించి స్మార్ట్‌సిటీ జాబితాలో చోటు కల్పించి వెయ్యి కోట్ల నిధులు తెచ్చాడని, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్, ఐదు జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జి సాధించిన ఘనత వినోద్‌కుమార్‌దేనని అన్నారు. గత ఎన్నికల్లో భార్య పుస్తెలు అమ్మి నామినేషన్ వేసిన సంజయ్‌కి ఇప్పుడు ఇన్ని వేలకోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకైన బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించబోతున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, పొన్నం అనిల్ గౌడ్, కెమసారం తిరుపతి, జయంత్, రవికాంత్ పాల్గొన్నారు.

మత్స్య సంపద సృష్టికి కృషి చేయాలి

- వివిధ రకాల చేపలు పెంచేలా ప్రణాళిక
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో వైవిధ్యమైన వివిధ రకాల చేపల పెంపకం జరిగేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి మత్స్య సంపదయోజన పథకంపై నిర్వహించిన డీ.ఎల్.సీ సమావేశానికి హాజరై మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి రూ.7లక్షల యూనిట్ వ్యయంతో నూతన చెరువులకు ఇద్దరు, రూ.3 లక్షల యూనిట్ వ్యయంతో ఆటో రిక్షాలకు మూడు దరఖాస్తులను అర్హులుగా గుర్తించామని వివరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న యూనిట్లను పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పథకం ద్వారా చేకూరే లాభాలు, ఆదాయ మార్గాలు, నష్ట నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన మెలకువలను, సహకారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్‌వో దేవేందర్, ట్రెడిషనల్ ఫిషర్‌మెన్ రాజన్న, పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో మెడికల్ అన్‌ఫిట్, ఉద్యోగంలో ఉండి మరణించినవారి పిల్లలకు కారుణ్య నియామకాల కోసం గురువారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లోని సమావేశ మందిరంలో సర్టిఫికెట్ల పరిశీలన,ఎత్తును కొలిచారు. మొత్తం 71మంది అర్హులు కాగా వారిలో 64 మంది హాజరయ్యారు.రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎస్.భూపతి రెడ్డి తదితరులు పరిశీలించారు.

క్లుప్తంగా

నేడు ఎన్‌హెచ్‌ఎం దరఖాస్తుదారుల లిస్టు

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద కరీంనగర్ డీఎంహెచ్‌వో పరిధిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తుదారుల ప్రొవిజనల్ లిస్టును శుక్ర, శనివారాల్లో ప్రదర్శించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8 విభాగాల్లో 45 పోస్టులకు గానూ 1,780 దరఖాస్తులు వచ్చాయన్నారు. అభ్యర్థుల జాబితాను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయ నోటీసు బోర్డు, అధికారిక వెబ్‌సైట్ https-://karimnagar.telangana.gov.inలో ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి 16న సాయంత్రం 5 గంటల వరకు ఉంచనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులకు దీనిపై అభ్యంతరాలుంటే సంబంధిత డాక్యుమెంట్‌తో డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ నెల 16న సాయంత్రం 5 గంటల్లోపు అందించాలని సూచించారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

రామడుగు(చొప్పదండి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడైన ప్రైవేట్ ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు రామడుగు ఎస్సై సురేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గుండి గ్రామ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినిని ఇదే పాఠశాల ఉపాధ్యాయుడు షానగర్‌కు చెందిన శ్రీధర్ ఈ నెల 10న కిడ్నాప్ చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ మాధవి ఈ కేసు వివరాలపై ఆరా తీశారు. నిందితుడిని బుధవారం రాత్రి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

17న ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న రామగుండంలోని అంతర్గాం ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో అండర్-20 ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. క్రీడాకారులు 01-01-2005 నుంచి 31-12-2007 మధ్య జన్మించి ఉండాన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 8 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు.

అనారోగ్యంతో మహిళా కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని మణితేజ ఇటుకబట్టీలో సుమిత్ర బోయి (57) అనే వలస కూలీ అనారోగ్యంతో మృతిచెందింది. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. సుమిత్ర తన భర్త సర్తా బోయితో కలిసి ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చింది. కొంతకాలంగా అస్తమాతో బాధపడుతున్న ఆమె అనారోగ్యానికి గురికావడంతో గురువారం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కమాన్ ప్రాంతంలో గురువారం విద్యుదాఘాతంతో కాటం శ్రీనివాస్‌గౌడ్(47) మృతిచెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌రావు తెలిపిన ప్రకారం.. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌గౌడ్ ఇనుప పైపులను సర్దేందుకు యత్నిస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE

■ 4ఎకరాల పొలం అమ్మకానికి కలదు. ఈ పొలంలో బావి వుంది, మోటర్ అండర్ గ్రౌండ్ పైపులైన్ వుంది, పొలం వరకు కారు వెళ్ళే దారి వుంది. సంప్ర॥ ప్రవీణ్, సెల్: 9640001100, గ్రా॥ జయ్యారం, మం॥ పాలకుర్తి, జి॥ పెద్దపల్లి. [K-1187112]

SERVICES
BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233886]

www.sakshi.com

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1167545]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [H-799854]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

బైక్ కొనాలనే ఆశ దొంగగా మార్చింది

- రూ.7 లక్షల విలువైన 12 బైకులు చోరీ
- వాహనాల తనిఖీలో పట్టుబడిన వైనం
- వివరాలు వెల్లడించిన టౌన్ ఏసీపీ నరేందర్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్‌క్రైం: కొత్త బైక్ కొనాలనుకునే ఆశ ఓ వ్యక్తిని దొంగగా మార్చింది. ఒక్కబైక్ దొంగతనం చేస్తే వచ్చిన డబ్బులతో కొత్త బైక్ కొనడం అసాధ్యం అని భావించాడు. మరో బైక్ దొంగతనం చేశారు. అయినా అతని ఆశ తీరలేదు. మరో బైక్ చోరీ చేశాడు. ఇలా ఏడాదిలో 12 బైక్‌లు దొంగలించాడు. వాటిని విక్రయించకుండా ఇంట్లోనే దాచిపెట్టాడు. చోరీచేసిన ఓ బైక్‌పై కరీంనగర్‌లో తిరుగుతుండగా గురువారం పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. కరీంనగర్ వన్‌టౌన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో టౌన్ ఏసీపీ నరేందర్ నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన గోస్కుల రాజు(27) ఏ పని చేయకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఇతడికి కొత్త బైక్ కొనాలనే ఆశ కలిగింది. సరిపడా డబ్బులు లేవు. బైక్ కొనేందుకు బైక్‌లనే దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఏడాదికాలంగా పెద్దపల్లిలో నాలుగు, సుల్తానాబాద్‌లో ఐదు, గోదావరిఖనిలో ఒకటి, కరీంనగర్ సిటీలో రెండు ఇలా మొత్తం 12 బైక్‌లు దొంగతనం చేసి ఇంటివద్ద దాచిపెట్టాడు. ఈ నెల 11న కరీంనగర్‌లోని ఒక థియేటర్ వద్ద పార్కింగ్ చేసిన తన బైక్ చోరీకి గురైందని దాని యజమాని చింతల సంపత్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై పోలీసులు నిఘా పెట్టారు. గురువారం నగర శివారులోని తీగలబ్రిడ్జి వద్ద ఎస్సై స్వామి వాహనాలు తనిఖీ చేస్తుండగా గోస్కుల రాజు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. అతడిని పట్టుకుని విచారించగా రూ.7లక్షల విలువైన 12బైకులు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. బైక్‌లు స్వాధీనం చేసుకుని రాజును రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ సరిలాల్, ఎస్సైలు స్వామి, రవి, కళ, హెడ్‌కానిస్టేబుల్ హసనొద్దీన్, కానిస్టేబుల్ బషీర్, కుమారస్వామిలను అభినందించిన ఏసీపీ రివార్డులు అందించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

- చికిత్స పొందుతూ గుండెపోటుతో పొలంపల్లివాసి మృతి
- చెల్లెలి కుటుంబానికీ ఆయనే అండ
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


తిరుపతి (ఫైల్)


తండ్రి అంతిమయాత్రలో కూతురు

తిమ్మాపూర్(మానకొండూర్): తన, తన చెల్లెలి కుటుంబాలకు ఆయనే పెద్ద దిక్కు. అందరినీ ప్రేమగా చూసుకునేవాడు.. అనారోగ్యానికి గురై, చివరికి గుండెపోటుతో మృతిచెందడంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన తిమ్మాపూర్ మండలంలోని పొలంపల్లిలో విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖమ్మం తిరుపతి స్థానికంగా పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన ఆయనకు బుధవారం అక్కడే గుండెపోటు రావడంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చి, గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతికి ఇద్దరు కూతుళ్లు కావడంతో పెద్ద కూతురు అఖిల తండ్రికి తలకొరివి పెట్టింది. ఇది చూసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు.

రెండేళ్ల క్రితం మృతుడి తండ్రి, బావ..

ఇదిలా ఉండగా, తిరుపతి తండ్రి రాజయ్య, బావ రామగిరి శ్రీనివాస్ రెండేళ్ల క్రితం మృతిచెందారు. దీంతో తిరుపతి తన కుటుంబంతోపాటు చెల్లెలి కుటుంబాన్ని చూసుకుంటున్నాడు. ఇంతలోనే ఆయన మృతిచెందడం వారికి తీరని దు:ఖాన్ని మిగిల్చింది. ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. అంత్యక్రియల్లో ఎంపీటీసీ సభ్యుడు బండారి రమేశ్, మాజీ సర్పంచ్ బొజ్జ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు వరకట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన శ్రీలతను వీణవంక మండల కేంద్రానికి చెందిన సముద్రాల క్రాంతికి ఇచ్చి, 13 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా అదనపు వరకట్నం తీసుకురావాలని అత్త తిరుపతమ్మ, భర్త క్రాంతి వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ, ట్రైబల్ సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024-25కు గానూ 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారిణి లక్ష్మాంజలి తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) అలుగునూర్ (కరీంనగర్), గౌలిదొడ్డి (రంగారెడ్డి)లోని పాఠశాలల్లో 9వ తరగతిలో రెగ్యులర్ అడ్మిషన్స్, టీటీడబ్ల్యూఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి (బాలికలు), వికారాబాద్, ఖమ్మం (బాలురు)లో 8వ తరగతిలో, రెగ్యులర్ ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. సీట్ల ఖాళీల వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు కోసం www.tswreis.ac.in < http://www.tswreis.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 21లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మొదటి విడత మూల్యాంకన ప్రక్రియను శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో పనిచేసే ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరుకావాలన్నారు. ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులను పద్మనగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం, గణితం, పౌరశాస్త్రం, తెలుగు సబ్జెక్టులను ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల)లో మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల, ఎగ్జామినర్ల నియామక ఉత్తర్వులు tsbie.cgg.gov.in మీ కళాశాల లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూల్యాంకన కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఓసీపీ-2లో ఒరిగిన షావల్.. తృటిలో తప్పిన ప్రమాదం


ఓసీపీ-2లో షావల్ ప్రమాదం

రామగిరి(మంథని): ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో గురువారం తృటిలో ప్రమాదం తప్పింది. 4 సిమ్ వద్ద హైవల్స్‌లో ఎస్-3 షావల్ బొగ్గును తొలగిస్తుండగా ఇసుక మేటా సైడ్ ఒరిగింది. వెంటనే గుర్తించిన ఆపరేటర్ షావల్ క్యాబిన్ నుంచి బయటకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కాగా రక్షణ సూత్రాలు వల్లించే యాజమాన్యం కార్మికులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రక్షణ సూత్రాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పట్టించుకోవడం తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరించడం షరామాములుగా మారిందని, ఇప్పటికైనా అధికారులు కార్మికుల రక్షణపై దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు.

గణిత ఒలింపియాడ్‌లో 'పారమిత' ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్ రశ్మిత, హెచ్‌ఎం రితేశ్ మెహతా

కొత్తపల్లి(కరీంనగర్): సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ గణిత ఒలింపియాడ్‌లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు అవార్డులు గెలుచుకున్నారని హెచ్‌ఎం రితేశ్ మెహతా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వగా తమ విద్యార్థులు జి.ప్రేమ్‌సాయి(8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ (జిల్లాలో 1వ ర్యాంక్), ఎండీ.రేయాన్ అహ్మద్ (6వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ (జిల్లాలో 2వ ర్యాంక్) సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిని విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్త రాము, గైడ్ టీచర్ లక్ష్మాద్రి, గణిత ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి


మహేందర్ (ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇల్లందకుంట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని వెన్కపల్లికి చెందిన మ్యాకల మహేందర్ ఇల్లందకుంటలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. గురువారం బహిర్భూమికి వెళ్లి, చెరువులో పడి, మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు..


వెంకటలక్ష్మి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వెనిశెట్టి వెంకటలక్ష్మి(92) అనే స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటలక్ష్మి స్వగ్రామం ప్రస్తుత హనుకొండ జిల్లా పరకాల్ పట్టణం. ఆమె తన భర్త లక్ష్మయ్యతో కలిసి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, మహారాష్ట్ర నాందేడు జైలులో శిక్ష అనుభవించింది. అనంతరం బయటకు వచ్చి, జమ్మికుంట పట్టణంలో వ్యాపారరీత్యా స్థిరపడ్డారు. ఇప్పటివరకు వారికి స్వాతంత్ర్య సమరయోధులకు ఇస్తున్న పింఛన్, ఇతర సౌకర్యాలు అందినట్లు స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ తెలిపారు. ఆమె మృతికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ సంజయ్, పక్కన నరేందర్ రెడ్డి

- దేశ సంస్కృతిని కాపాడాలి
- 'అల్ఫోర్స్ ఆనందోత్సవ్'లో ఎంపీ బండి సంజయ్


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంపీ బండి సంజయ్ అన్నారు. 'అల్ఫోర్స్ ఆనందోత్సవ్' పేరిట గురువారం రాత్రి నిర్వహించిన కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలే ప్రశంసిస్తున్నాయని, వాటిని కాపాడుకుంటూ ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను విద్య విషయంలో ఒత్తిడి చేయకుండా వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులను తీర్చిదిద్దిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని అభినందించారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా విద్యాబోధన సాగిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోట్ విద్యను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ క్రీడాంశాలు, పోటీ పరీక్షల్లో రాణించిన పిల్లలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దీర్ఘకాలిక షుగర్, బీపీతోనే కిడ్నీ సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ రాంచందర్

కరీంనగర్‌టౌన్: దీర్ఘకాలిక షుగర్, బీపీతోనే కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని మెడికవర్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ తొర్రం తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఎస్సారార్ కళాశాల మైదానంలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్‌టాక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది కిడ్నీ ఆరోగ్యం -అందరికీ అనే నినాదంతో కిడ్నీ డే జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే షుగర్, బీపీలను అదుపులో ఉంచుకోవాలన్నారు. వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ను మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి, వాడటం వల్ల ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. మాంసాహారం ఎక్కువగా తీసుకుంటూ ఆహార నియమాలు పాటించకపోవడం, నీరు తాగకపోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల కిడ్నీ సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. కిడ్నీ స్టోన్స్ ఉన్నవాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా యూరిన్, క్రియాటినిన్ పరీక్షలు చేయించుకుంటే సమస్యను ముందే గుర్తించవచ్చని చెప్పారు. వాకర్స్ కోసం హెల్త్ క్యాంపు నిర్వహించి, ఆస్పత్రిలో రూ.500కే అందిస్తున్న కంప్లీట్ కిడ్నీ ప్యాకేజ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన 'అనభేరి'

- అమరవీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


అనభేరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెంకట్‌రెడ్డి, అనభేరి కుమార్తె విప్లవకుమారి, సీపీఐ నాయకులు

కరీంనగర్: హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాంకు వ్యతిరేకంగా అనభేరి ప్రభాకర్‌రావు వీరోచితంగా పోరాడారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయనతోపాటు అమరవీరులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి మహనీయుల విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 76వ వర్ధంతి సందర్భంగా గురువారం కరీంనగర్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో మాట్లాడారు. తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లిలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన అనభేరి తన చిన్నతనంలోనే గ్రామాల్లో దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీల పెత్తనం, నిజాం నవాబ్‌లు, రజాకార్ల ఆగడాలను సహించేవాడు కాదన్నారు. 1948 మార్చి 14న మహ్మదాపూర్‌లో తన దళం సభ్యులతో భోజనం చేస్తుండగా రజాకార్లు కాల్పులు జరపడంతో చనిపోయారని తెలిపారు. విలీన దినోత్సవాన్ని కర్ణాటక, మహారాష్ట్రల్లో అధికారికంగా నిర్వహిస్తున్నారని, మన రాష్ట్రంలో నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, అనభేరి ప్రభాకర్‌రావు కుమార్తె విప్లవ కుమారి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లవ్వ, పైడిపెల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, చాడ శ్రీధర్ రెడ్డి, బామండ్లపల్లి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

పెనాల్టీ విధానం రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-2 ఏరియా పరిధిలో పని చేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేస్తున్న పెనాల్టీలను వెంటనే రద్దు చేయాలని వివిధ సంఘాల నాయకులు గురువారం జీఎం సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనారోగ్య కారణాలతో కాంట్రాక్ట్ కార్మికులు విధులకు హాజరుకాకుంటే రోజుకు రూ.300 చొప్పున కటింగ్ చేసే విధానంతో వారు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కటింగ్ చేసే విధానం రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన జీఎం తక్షణమే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే లా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి రాజారత్నం, జిల్లా నాయకులు ఉల్లి మొగిలి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ పేర్కొన్నారు.

'కార్మిక కుటుంబాలను తరలించడం సరికాదు'

గోదావరిఖని(రామగుండం): రోడ్డు వెడల్పు పేరుతో కార్మిక కుటుంబాలను తరలించడం సరికాదని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం కార్మికులు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. 30ఏళ్ల నుంచి క్వార్టర్ అలాట్‌మెంట్ చేసుకుని నివసిస్తున్న (న్యూఅశోక్ టాకీస్ నుంచి కళ్యాణ్‌నగర్, ఓల్డ్ అశోక్‌టాకీస్ ఎదురుగా ఉన్న వీకేరెడ్డి స్వీట్ హౌజ్, మజీద్‌టర్నింగ్ వరకు) క్వార్టర్లను తొలగించడం అన్యాయమన్నారు. జాతీయ సంపదను వెలికితీయడంలో కీలక భూమిక పోషించిన కార్మికుల సంక్షేమాన్ని, నిబంధనలకు నీళ్లు వదిలిన యాజమాన్యం అక్రమంగా నోటీసులు జారీ చేసిందన్నారు. కార్మికుల నివాస ప్రాంతాలైన క్వార్టర్స్ మినహాయించి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన మహిళా దినోత్సవం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జీఎం సూర్యనారాయణ


నృత్యం చేస్తున్న మహిళలు

గోదావరిఖని(రామగుండం): అంతర్జాతీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం యైటింక్లయిన్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన వేడుకలు అలరించాయి. ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు మాలతి, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ నేత రవీందర్, సీఎంవోఏఐటీ ప్రతినిధి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు చంద్రపాల్ దంపతులకు సన్మానం


చంద్రపాల్ దంపతులను సన్మానిస్తున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు తదితరులు

రామగిరి(మంథని): ఆర్జీ-3 పరిధి ఓసీపీ-1లో విధులు నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ పోతుల చంద్రపాల్‌నీనా మార్గరేట్ దంపతులను బుధవారం రాత్రి సెంటనరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడాప్రాంగణంలో జీఎం ఎస్.సుధాకర్‌రావు, ఏపీఏ అధికారులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగి చంద్రపాల్ నటుడు, కళాకారుడు, క్రీడాకారుడిగా రాణించి సంస్థ కీర్తి పతాకాన్ని కోల్ ఇండియా స్థాయిలో ఎగురవేశారన్నారు. అలాగే పలు సామాజిక అంశాలపై లఘు చిత్రాలు నిర్మించి సామాజికాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం అతిథుల కోరిక మేరకు చంద్రపాల్ ప్రదర్శించిన స్టాండ్ ఆఫ్ కామెడీ అలరించింది. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, యూనియన్ సంఘాల ప్రతినిధులు వైవీ రావు, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం నాయకులు శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి సునీల్‌ప్రసాద్, క్రీడా సమన్వయ కర్త బూస వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే
ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్‌ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్‌ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్‌ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్‌ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్‌ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్‌ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్‌ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్‌ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్‌ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి ధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్‌ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల
ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్‌ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్‌ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్‌ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

'కడెం'ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జుపటేల్
- ప్రాజెక్టుకు మరమ్మతు పనులు ప్రారంభం

కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక ప్రాజెక్టు అయిన కడెంను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.5.46 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన కడెం ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని అన్నారు. ప్రాజెక్టు నిర్వహణను కూడా బీఆర్‌ఎస్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. దీని ఫలితంగా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రాజెక్టు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కడెం ఆయకట్టు రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కడెం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, 25 గేట్లతో కడెం ప్రాజెక్టు పునర్నిర్మాణం అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అలెగ్జాండర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, భూమేశ్, వెంకటేశ్, సాగర్, సత్తెన్న, రఫీక్, సత్యం చారి, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.




పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



వరద గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జీడీకే-5 ఓసీపీకి మరో 30 ఏళ్ల భవిష్యత్!



జీడీకే-5 ఓసీపీ



బెల్ట్‌ద్వారా బయటకు వస్తున్న బొగ్గు

- పంచ్‌ఎంట్రీ తరహాలో ఓసీపీ
- ప్రస్తుత ఓసీపీకి తగ్గిన జీవితకాలం
- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న యాజమాన్యం

ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు: పంచ్‌ఎంట్రీ
టెక్నాలజీ : కంటిన్యూస్ మైనర్
జీవితకాలం: సుమారు 30 ఏళ్లు
బొగ్గు నిల్వలు: 40 మిలియన్ టన్నులు
ఏటా ఉత్పత్తి: ఒక మిలియన్ టన్ను
అంచనా వ్యయం: రూ.150 కోట్లు

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో బొగ్గునిల్వలు అడుగంటిపోతున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వెళ్తున్న యాజమాన్యం దానికి తగ్గట్టుగా విస్తరణ లేకపోవడంతో గనుల మూసివేతకు దారి తీస్తోంది. ఇటీవలే గోదావరిఖని సమీపంలో ఏర్పాటైన జీడీకే-5ఓసీపీ పరిస్థితి అలాగే తయారైంది. మరో 8ఏళ్లలో బొగ్గు నిల్వలు పూర్తయి కాలగర్భంలో కలిసిపోనుంది. వాస్తవానికి 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఏటా వార్షిక లక్ష్యాలు పెంచుకుంటూ వెళ్తుండటంతో బొగ్గు నిల్వలు అడుగంటిపోతున్నాయి. నాలుగేళ్ల ముందుగానే ఈ ప్రాజెక్టులో బొగ్గు నిల్వలు పూర్తికానున్నాయి. ఈక్రమంలో ఈప్రాంతంలో బొగ్గుగని జీవితకాలం పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జీడీకే-5 ఓసీపీ క్వారీలో 300 మీటర్ల లోతులో పంచ్‌ఎంట్రీ ఏర్పాటు చేసి 600 మీటర్ల లోతు వరకు ఉన్న బొగ్గును వెలికితీసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో భూమిపొరల్లో ఉన్న బొగ్గును వెలికితీయడం ప్రారంభిస్తే జీడీకే-5 ఓసీపీకి మరో 30ఏళ్ల భవిష్యత్ ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిదేళ్ల జీవిత కాలంతో పాటు మరో 30 ఏళ్లు కలిస్తే 38 ఏళ్లపాటు ఈ ప్రాజెక్టు ఢోకా ఉండబోదని నిపుణులు చెబుతున్నారు.

డిమాండ్ పెరగడంతో..

గోదావరిఖని సమీపంలో 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా జీడీకే-5 ఓసీపీని భూగర్భగనుల స్థానంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపాదనలు రూపొందించిన సమయంలో ఉత్పత్తి లక్ష్యం తక్కువగా కేటాయించినప్పటికీ విద్యుత్‌సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వార్షిక లక్ష్యాలను అనూహ్యంగా పెంచారు. దీంతో జీవిత కాలం పదేళ్లకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత ఓసీపీ మూసివేసే పరిస్థితి ఏర్పడింది.

పంచ్‌ఎంట్రీ పేరుతో కొత్త గని

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో పంచ్‌ఎంట్రీ ద్వారా భూగర్భగని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు మొదలయ్యాయి. ఓసీపీ లోపల 300 మీటర్ల లోతులో ఐదు సొరంగాలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 600మీటర్ల లోతువరకు బొగ్గును వెలికితీయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది ఆచరణ రూపం దాల్చితే మరో 30ఏళ్ల భవిష్యత్ పెరగనుంది. ప్రాథమికంగా దీనిపై నివేదికలు ఉన్నతస్థాయికి వెళ్లినట్లు తెలుస్తోంది. రామగుండం రీజియన్‌లో భూగర్భగనులు రోజురోజుకు తగ్గిపోతుండటం, పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు తగ్గుతున్న క్రమంలో యాజమాన్యం తీసుకునే ఈనిర్ణయంతో మరో 30 ఏళ్ల భవిష్యత్ ఉండనుంది.

చెట్లపొదల్లో నవజాత శిశువు

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని శివారులో ఘటన
- శిశుగృహకు తరలించిన అధికారులు

తాంసి: నవజాత శిశువును ఎవరో పంటచేనులో వదిలివెళ్లిన అమానవీయ ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం వేకువజామున 5గంటలకు నిపాని గ్రామానికి చెందిన గంగమ్మ సమీపంలోని పంటచేను వద్దకు బహిర్భూమికి వెళ్లగా పసికందు ఏడుపు వినిపించింది. వెంటనే ఆమె పొదల్లో పడి ఉన్న మగశిశువును గుర్తించింది. ఆమె సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్తులు శిశువును అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోకి తీసుకువెళ్లి స్నానం చేయించి పాలు పట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ప్రదీప్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. శిశువును మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం అంబులెన్స్‌లో తరలించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. కాగా, మహారాష్ట్ర నుంచి అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్లేవారెవరైనా శిశువును వదిలి వెళ్లి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కాగా, శిశువు లభించిన స్థానంలో మహిళ ప్రసవించిన ఆనవాళ్లు ఉన్నాయి.



పంటచేనులో శిశువు



శిశుగృహ సిబ్బందికి అప్పగిస్తున్న అధికారులు

రిమ్స్‌లో ముక్కు మూసుకోవాల్సిందే..











ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లో చెత్తాచెదారం రోజుల తరబడి పేరుకుపోతోంది. పైగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేడు 'షరతులు వర్తిస్తాయి' విడుదల

- సినిమా దర్శకుడు గోదావరిఖనివాసి

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ యాస, భాష ఎంచుకొని, మధ్యతరగతి మనుషుల జీవితాలను, తాను పడిన, చూసిన కష్టనష్టాలను, సంతోషాలను ఇతివృత్తంగా గోదావరిఖనికి చెందిన రచయిత, దర్శకుడు కుమారస్వామి(అక్షరకుమార్) స్టార్ లైట్ స్టూడియో బ్యానర్‌లో 'షరతులు వర్తిసాయి' అనే చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. చిత్రీకరణ హీరో, హీరోయిన్‌ల ఇళ్లున్న కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి, ఎల్ఎండీ కాలనీ, శుభమంగళ ఫంక్షన్‌హాల్, వివేకానంద హైస్కూల్, భాగవతి స్కూల్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో జరిగింది. ఇది ఆద్యంతం విజ్ఞానం, వినోదం పంచే సినిమాగా నిలుస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.





సినిమా పోస్టర్, చిత్ర నటులతో దర్శకుడు కుమారస్వామి (మధ్యలో)

మంచి సినిమా.. ఆదరించండి

కరీంనగర్ ఎన్నో ఉద్యమాలకు, త్యాగాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. షరతులు వర్తిస్తాయి సినిమా మీ సమయాన్ని, డబ్బును వృథా చేయదు. ఇది సామాన్యుల బతుకు చిత్రం. మంచి సినిమా.. ప్రేక్షకులు ఆదరించాలి. తెలంగాణ సినిమాను నిలబెట్టాలి.

– కుమారస్వామి, రచయిత, దర్శకుడు

వృద్ధురాలి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం: మాయమాటలు చెప్పి, గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సప్తగిరికాలనీకి చెందిన గంగిపెల్లి బాలయ్య మంకమ్మతోటలో ఇస్త్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఆయనకు భోజనం ఇవ్వడానికి భార్య శంకరమ్మ వెళ్తోంది. దారిలో ఇద్దరు యువకులు కలిసి.. పోలీసులు తనిఖీ చేసి, బంగారం తీసుకుంటున్నారని, తమకు ఇస్తే వారిని దాటగానే ఇచ్చేస్తామని నమ్మించారు. దీంతో ఆమె తన వద్ద ఉన్న రూ.90 వేల విలువైన పుస్తెల తాడు, ఉంగరం ఇచ్చేసింది. వారు వెంటనే బైక్‌పై పారిపోయారు. తర్వాత దొంగలని గుర్తించిన శంకరమ్మ అరవడంతో స్థానికులు వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ కనిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.